# శుక్రనీతి

మేడపైన గదిలో కిటికీ ప్రక్కన కూర్చుని చదువుతుంటున్నాను. చేతిలో ఉన్నది పాఠ్యపుస్తకమై, నేను విద్యార్థినై వుండే ఎంత బాగుండేది! ఆ బంగారు కాలం గడచిపోయింది. నేను నిరుద్యోగిని. ఇప్పుడున్నంత తీరిక జీవితంలో మరెప్పుడూ నాకు దొరకదని చెప్పి బుద్ధిమంతులు కొందరు మురిపిస్తూ వుంటారు. ఆ మాట నిజమేగానీ ఒక విషయం గమనించాలి. బహుళ పంచమి జ్యోత్స్న కూడా ఒకాయన్ను భయపెట్టిందట! అవునుమరి. చదువురాని, మొద్దబ్బాయిని బడిగంట భయపెట్టదా? షుగర్ కంప్లెయింటువున్న వ్యక్తిని జిలేబీల ప్లేటు భయపెట్టదా? అట్లాగే నిరుద్యోగిని పరీక్షకు గురిచేసేది తీరిక. చీకటింట్లో క్రమ్ముకున్న కుంపటి పొగలా అది నిరుద్యోగిని ఉక్కిరిబిక్కిరి చేసేస్తుంది ఊపిరి సలపనియ్యదు. ఇప్పటికిప్పుడు చూడండి. మధ్యాహ్నం నుంచీ ప్రయత్నించినా ఒక కథను తీరా మూరా చదవలేక పోతున్నాను. ఒక ముఖ్యమైన పనిమీద ఈ వూరొచ్చాను. ఆ పని నెరవేరాలంటే మా మామయ్య తోడ్పాటు అత్యవసరం. ఆయన వూళ్ళోలేదు. ముత్యాలపాడువెళ్ళి మూడు రోజులైందట. సాయంకాలానికి తిరిగిరావాలని అత్తయ్య భరోసా యిస్తూ వుంది.

ముత్యాలపాడు ముగ్గురాళ్ళ గనుల్లో పనిచేసే కార్మికులకు యాజమాన్యంతో తగాదా వచ్చిందట. వాళ్ళు సదుపాయాలు హెచ్చించమన్నారు. యజమానులు వీలుకాదని హఠంపట్టి కొత్త కూలీలను తోలుకొస్తామని సవాలు చేసారు. కానీ ఆ పని చేతగాక కార్మికులపైన కక్ష తీర్చుకోవడం కోసం 'లాకౌట్' ప్రకటించారు. చేసేదిలేక కొందరు కార్మికనాయకులు నిరాహారదీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంలో కార్మికోద్యమానికి నాయకత్వం వహించడంకోసం మా నరసింహం మామయ్య రెక్కలు గట్టుకున్నట్టుగా వెళ్ళి, ముత్యాలపాడులో వాలిపోయాడట. అదీ సంగతి.

అసలు మా మామయ్య డ్యూటీయే అది! కార్మికులకు అన్యాయం జరిగినా, విద్యార్థులు హక్కులకోసం పోరాడినా, ఎన్జీవోలకు మద్దతు ఇవ్వాలన్నా- పీడిత

లందరికీ బాసటగా నిలిచేవ్యక్తి మా మామయ్య. మానవ నాగరికతకు గమ్యం సోష లిజమేనని ఆయన విశ్వాసం. ఆ గమ్యాన్ని చేరుకోడానికి వర్గపోరాటమే మార్గ మని ఆయన కృత నిశ్చయం. ప్రజల్ని అందుకు ఉద్యుక్తులుగా చేయడమే ఆయన ధ్యేయం. ఎన్నుకున్న లక్ష్యాన్ని బట్టి ఆయన పాలనా యంత్రాంగానికి శీరని తల నొప్పిగా వుండాలికదా! అలాంటివేమీ కనిపించదు. మీదుమిక్కిలి హైదరాబాదులో ఆయన మాటకు బాగా చెల్లుబడి వుంది. పురాణయుగంలో విరోధం ద్వారా భక్తిని ప్రదర్శించే సాంప్రదాయం ఒకటి ఉండేదట ! దానిపేరు 'వైరభక్తి' రావణునికి రాముడుపైన, కంసుడికి శ్రీకృష్ణునిపైన నెలకొన్నది ఈభక్తేనట! బహుశా మా మామయ్యకు, ప్రభుత్వానికి మధ్య అలాంటి సంబంధమేదో వుండి వుండాలని నా వూహ !

సరే, మా మామయ్య స్వీయచరిత్ర నాకెందుకు! ఒకసారి ఆయన్ను హైద రాబాదు తీసుకెళ్తే నా రొట్టెవిరిగి తేనెలో పడుతుంది. ఆదీ ఆలస్యం చేయడానికి లేదు. అర్జంటుగా వెళ్ళాలి...

నేను గదిలోనే వున్నప్పటికి, నా చూపులన్నీ రోడ్డుపైనే వున్నాయి, మామయ్య రాకకోసం సల్పుతున్న ప్రతీక్షవల్ల కలిగిన చిరాకుతోపాటు ఆనాటి వాతావరణం గూడా చీదర చీదరగా వుంది. రకరకాల వేషాలు సంతరించుకుని నల్లటి మబ్బులు ఆకాశాన పరవళ్ళు త్రొక్కుతున్నాయి. ఈతాకుతో గుచ్చినట్టుగా ఈదురగాలులు విసవిసలాడిపోతున్నాయి. చాలనిదానికి కిటికీ చువ్వలనుంచీ కాన వస్తున్న దృశ్యం ఒకటి వద్దన్నా గుండెల్ని పిండేస్తూ మతి పోగొడుతూంది. వూరి నుంచి కొంచెం వైదొలగి వుండేటట్టుగా మామయ్య కట్టించుకున్న మేడకొన వంద గజాల దూరంలో రోడ్డుదాపున ఒక చింతచెట్టువుంది పిచ్చిగుంటవాళ్ళో, తిరుగుదాసరి వాళ్ళో, కోనాముష్టివాళ్లో-ఎవరో గానీ మొత్తంపైన దేశదిమ్మరులని మాత్రం చెప్ప గలను-తట్టలు బుట్టలు,మూటలు,గోనెసంచులు ఎక్కడికక్కడ సర్దిపెట్టుకుని ఆ చెట్టు తోడెచుట్టూ ఆశ్రయం ఏర్పరచుకున్నారు. మగవాళ్ళు,ఆడవాళ్ళు అడుక్కురావడం కోసం వూరిపైకి వెళ్ళారేమో,ముసలా ముతకా, పిల్లాజెల్లా మాత్రమే చెట్టుక్రింద కని పిస్తున్నారు. మగపిల్లల్లో చాలామందికి గోచీలు కూడా లేవు. ఆడపిల్లలు చీలికలు వాలికలైన పేలికలనే మొలకు చుట్టుకున్నారు. కొందరు ముసలివాళ్ళు ఒకచోట గుంపుగాకూర్చుని కాకివెదురుతో పీకలు,తాటాకులతో గిలకలు తయారు చేస్తున్నారు. నోట పళ్ళులేని ఒక ముసలావిడ వక్కా- ఆకుకు బదులుగా చింతచెట్టు బెరడును

నున్నగాదంచి నోట్లో వేసుకుంటూ వుంది. ఇద్దరు వృద్ధులు అవసరమైనప్పుడు చలి మంటవేసుకోడం కోసం పుల్లలు, చితుకులు ఏరి తెచ్చుకుంటున్నారు. దరిద్రదేవత వ్యాఖ్యానం అక్కర్లేదు. ఆ దృశ్యాన్ని ఫోటోతీసి చూపిస్తేచాలు!

రోడ్డువైపు చూస్తూ కూర్చున్నంత మాత్రాన మామయ్య త్వరగా వచ్చేస్తాడా ఏమిటి? అందుకని క్రిందివైపు కిటికీ తలుపులు రెండూ మూసేసాను. ఇప్పుడు నా దృక్పథంలోనుంచి చింతచెట్టుకూడా మటుమాయమైపోయింది.

ఈసారి తలపైకెత్తకుండా ఓ కథను సాకల్యంగా చదివి ముగించాలనుకున్నాను. స్వర్గానికి వెళ్ళినా సవతిపోరు తప్పదన్నట్టు, ఆ కథలోగూడా నాకొక నిరుద్యోగే తారసిల్లాడు. డిగ్రీపుచ్చుకుని ఏడేళ్ళయిందట! కాళ్ళరిగేట్టుగా తిరిగాడట! చేతులరిగిపోయేట్టుగా అప్లికేషన్లు రాసి పడేశాడట! కానీ ఏం లాభం? అందినట్టే తోచి, అంతలో అందకుండా పోతూ ఉద్యోగం మాయలేడిలా అతన్ని మోసగిస్తూనేవుందంట! అయితే ఒకటి కథా రచయిత ఎవరోగానీ,ఆయన కొంచెం ఉదార మనస్కుడనే చెప్పాలి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించిన తర్వాతగానీ ఆయన కథను ముగించలేదు. అందుకోసమని నిరుద్యోగికి ముసలి ఆఫీసరుగారితో పరిచయం కలిగించారు.నాలుగైదురోజుల్లో రిటైరు కావలిసివున్న ఆ ఆఫీసరుగారికిపెళ్ళికావల్సిన ఓ కూతురుంది. నిరుద్యోగి అదృష్టంకొద్దీ ఆమెకు అంగవైకల్యమేమీలేదు.లేదంటే మనిషి కాస్తా స్థూలంగా వుంటుంది. ఆమెను పెళ్ళాడే షరతుమీద ఆఫీసరుగారు యువకుడికి ఉద్యోగం చూచి పెడతారు. అంతకంటే కావలిసిందేముంది? కథ పరిసమాప్తమవుతుంది బాగానే వుందిగానీ, ఆ కథ చదివి ముగించేసరికి నాకు ఏడుపొచ్చినంతపనైపోయింది. పెళ్ళి కావలసిన కూతుళ్ళమాట దేవుడెరుగు, మామయ్యకు ఆడసంతానం లేదు. పుట్టింది ముగ్గురూ మగబిడ్డలే! ఒక్కొక్కరికీ యాభైనుంచి అరవై వేలదాకా ఆయన కట్నాలువసూలు చేసుకున్నారని ప్రతీతి. బహుశా అది కిట్టనివాళ్ళు చేస్తూ వచ్చిన దుష్ప్రచారమై వుండాలని నేను అనుకున్నాను కానీ "ఉన్నవాళ్ళ దగ్గర నుంచి తీసుకోడంలో తప్పేముందిరా! సోషలిజం అంటే అదేకదా!" అని మామయ్య తేల్చి చెప్పడంతో నాకు జ్ఞానోదయమైపోయింది. కానీ అందువల్ల నా కొరిగేదేముంది? నేనడిగివచ్చిన రాత చిన్నది. మామయ్యకే గనుక కూతురుంటే ఆ పిల్లతోపాటు కట్నమూ, ఉద్యోగము గూడా ఈపాటికెప్పుడో నా హస్తగతమై పోయి వుండేవి.

క్రిందనుంచి మా అత్తయ్య ఎవరితోనో బిగ్గరగా మాట్లాడుతూ వుండడము

వినిపించింది. ఆమెకు సాధారణంగా కోపంరాదు. వచ్చిందంటే అందుకు ప్రబలమైన కారణమేదో వుండితీరాలి. అదేమిటో తెలుసుకుందామని క్రిందికి దిగి వద్చాను.

భుజంపైన వేసుకున్న రవికను మాసిక కనిపించకుండా కొంగును మాటి మాటికి పైకిలాక్కుంటూ ఒక నడితనం ఆడమనిషి అత్తయ్యవైపు గుడ్లప్పగించి చూస్తోంది. అపరాధం చేసినవాళ్ళ వాలకం అలాగే వుంటుందేమో! ముందూ వెనకా చూడకుండా అత్తయ్య ఆమెను దులిపేస్తోంది.

"కాదులే రంగమ్మా! మీ బ్రతుకులు అట్లా ఎందుకున్నాయంటావు? ఈ లేకి బుద్ధులవల్లనే!మాకేం డబ్బులు బరువై మీకిస్తున్నామా? మీ కక్కుర్తికే కదంటమ్మా మీరప్పులు చేసేది! ఆఖరికి మేమన్నా మార్వాడివాళ్ళలాగా, కాబూలీ వాళ్లలాగా పదో పదిహేనో అడుగుతున్నామా? అయిదు రూపాయలరేటుకే ఇస్తున్నాంగదా! నెల పుట్టేసరికి ఆ వడ్డీడబ్బులయినా తెచ్చి మా ముఖాన కొట్టరాదా! ఇదెక్కడి న్యాయమమ్మా? ఒక నెల నెలంతా కనిపించకుండా పోయి, యిప్పుడు. తీరిగ్గా కాళ్ళీడ్చుకుంటూ వస్తావానువ్వు! రేపొద్దున యింకొక అయిదువందలు కావాలంటే, నువ్వు పుట్టించుకోగలవా?"

"అబ్బే, అలా అనకండమ్మగారూ! పొరబాటైపోయింది. పోయిన్నెల నా కూతురు తిరగమాడింది. పురుడు చేయాల్సి వచ్చింది. బంధులొచ్చిపడ్డారు. దాలని దానికి మరిన్ని అప్పులైపోయాయి. ఈసారికి మన్నించెయ్యండి రెండు నెలల వడ్డీ తీసుకొచ్చాను ఇంకెప్పుడూ ఇలా జరక్కుండా జాగ్రత్తపడతాను..."

"ఎప్పుడూ వున్నాదేగా! ఈ సాకులకేం లే! డబ్బు అక్కడ పెట్టి వెళ్ళు..."

ఆవిడ వెళ్ళిపోయాక అత్తయ్య నా వైపు తిరిగింది. "చూసావానాయనా! డబ్బులివ్వడం వల్ల కలిగే బాధలిలా వున్నాయి" అంటూ వాపోయింది.

"వడ్డీ యివ్వడానికే యిలా హైరానా పడిపోతుందే, యిక అసలు ముట్టేదెప్పుడత్తయ్యా?" అని నా కుతూహలం కొద్దీ నేను ప్రశ్నించాను.

"ఆ మాటెందుకులే! అయిదువందలు పట్టుకెళ్ళి రెండేళ్ళయింది. అదింక మన చేతికొచ్చేది-మూగాడు 'అమ్మా' అన్ననాటికే!"

"అయ్యోపాపం! పితకష్టాలు పితవి" అనుకుంటూ వేడిగా నిట్టూర్చాను.

ఆరోజు రాత్రి భోజనాల వేళకు కొంచెం ముందుకు రోడ్డుపైన బస్సాగింది. బస్సు కార్మికుల యూనియన్‌తో గూడా సన్నిహిత సంబంధాలుండడంవల్ల మా మామయ్యను ఎక్కించుకోవాలన్నా, దింపాలన్నా బస్సు యింటిముందరే ఆగు తుంది. బస్సుదిగి లోపల కొస్తూ మామయ్య "ఏమిట్రా రఘుపతీ! ఎప్పుడొచ్చావు? ఏమిటీ విశేషాలు?" అని పలకరించాడు.

భోజనానికి కూర్చున్న తర్వాత అసలు విషయాన్ని ప్రస్తావించాను.

మామయ్య ఎంతో ఆసక్తిగా వివరాలన్నీ ఆలకించాడు. ఆయన ముఖభంగి మలోని ప్రసన్నతను బట్టి, నేను వచ్చినపని పండే కావచ్చునని నేను నిర్ణయించు కున్నాను. కాని ఆయన పెదివి కదిపి 'అవును' అనిగానీ 'కాదు' అనిగానీ చెప్పక పోవడం నాకొక్కింత సందేహాన్నే కలిగించింది.

భోజనానంతరం ఆయన టవలుతో చేయి తుడుచుకుంటూ వాలు కుర్చీలోకి సోలిపోయాడు. ఇప్పుడిక ఆయన తన అభిప్రాయాన్ని తేల్చి చెప్పబోతున్నాడని నేను స్పష్టంగా గ్రహించాను.

"ఒరే అబ్బాయ్!" నింపాదిగా ప్రారంభించాడాయన" అవసరమైన అర్హత లన్నీ నీకున్నాయి. ఒప్పుకుంటాను. కాని కావలిసిందల్లా అర్హతలేననుకుంటే ఎలా? లోకం పోకడ తెలీకుండా మాట్లాడితే ఏమని చెప్పగలను! నువ్వు నన్ను హైదరాబాదుకు తీసుకెళ్తావుసరే!కానీ సిపార్సొక్కటే చాలదే! మంత్రాలకు మామిడి కాయలు రాల్తాయా చెప్పు! అబ్బే, లాభం లేదురా నాయనా! ఎంత బంగారమైనా ఎలిగారం పెట్టనిదే అతకదు.క్యాష్ వుండాలి, ఉండితీరాలి. మనం రిక్త హస్తాలతో వెళ్ళి లాభం లేదు. చేతికావలిగా ఓ పదివేలైనా మన దగ్గరుండాలి. అందుకు సిద్ధంగా నువ్వు? ముందా సంగతి చెప్పు...వుంటే సరేసబ్బా! ప్రయాణానికి నేను సిద్ధం!"

నేను కూర్చున్న కుర్చీ పాతాళంలోకి క్రుంగి పోతున్నట్లు, కరెంటు లైటు వెలుగుతూనే వున్నా కళ్ళయెదుట కారు చీకట్లు క్రమ్ముకున్నట్టు, పెద్ద రైలు బండి ఒకటి సూటిగా నాతల పైన్నుంచే వెళ్ళిపోతున్నట్టు నేను స్తబ్దుడినైపోయాను.

పడుకున్నానేగాని ఆ రోజు రాత్రి నాకు సరిగా నిద్రపట్టలేదు. 'ఆయనుంటే

యిక మంగలెందు' కని నేను మా మామయ్యతో చెప్పి వుండవలసింది. చెప్పక పోయినంత మాత్రాన నా పరిస్థితి ఆయనకు తెలియని దేమీగాదు. తెలిసిగూడా ఆయన డబ్బు ప్రసక్తి తెస్తున్నారంటే, ఏమను కోవాలి? ఈ 'సోర్స్' గుండా పనినెరవేరే అవకాశం లేదు. చెంపలు వేసుకుంటూ తిరుగుదారి పట్టాలి. అంతకంటే గత్యంతరం మేముంది?

అర్ధరాత్రి తరువాత ఎప్పుడో ఆదమరిచినట్టుగా మగత నిద్రలోకి జారుకున్నాను. ఎంతసేపు నిద్రపోయానో తెలియదు. హఠాత్తుగా నిద్రా భంగమై పోయి. ఉలిక్కిపడ్డట్టుగా మేలుకున్నాను. కిటికీలోనుంచీ చొచ్చుకొస్తున్న వానజల్లువల్ల పరుపు ఒకవైపున చల్లగా తడిసిపోతూ వుంది. మంచం పైన్నుంచీ క్రిందికి దూకి, కిటికీ తలుపులుమూసి, గడియ పెట్టేశాను. మంచాన్ని అవతలికి లాక్కో బోతుండగా గజిబిజిగా ఏవో శబ్దాలు వినిపించాయి. చెవి ఒగ్గి విన్నాక బోధపడింది. మింటికి మంటికీ ఏకధారగా కురుస్తున్న వాన చప్పుడు నేపథ్యంలో నుంచీ కేకలు కూతలు, ఆక్రోశాలు అదిలింపులు ఎడతెరపి లేకుండా వినవస్తున్నాయి. చరచరా నాలుగడుగులు ముందుకు వేసి గది తలుపులు తెరిచాను. హాల్లో దీపం వెలుగుతోంది. మామయ్య సింహ ద్వారానికి అడ్డంగా నిలబడి గొంతెత్తి బిగ్గరగా అరుస్తున్నారు—

"ఒరేయ్ ఒరేయ్! సైతాన్ పిల్లల్లాగా ఎక్కడనుంచి వూడిపడ్డార్రా మీరు! వెళ్ళండి. వెళ్ళండి, ఈ యింటికి వరండా పెట్టింది మీకోసమేనట్రా? మిమ్మల్నిక్కడ వుండనిస్తే యింకేమైనా వుందా? ఈలోగిలంతా గలీజుచేసి పారెయ్యరూ! వెళ్ళండి. ఏ గుడో, సత్రమో చూచుకోండి. వద్దు, ఇక్కడుండనే వుండొద్దు, ఉన్నారో, ఫోన్ చేసి పోలీసుల్ని పిలిపిస్తా. మీచమ్డా తోలుతీయిస్తా...."

నేను గుమ్మంలోకి వెళ్లేసరికి వాళ్ళు సాగబారి రోడ్డు వైపు వెళ్ళిపోతున్నారు. దిక్కులేని గువ్వల్లా తట్టలు బుట్టలు ఊడ్చుకుంటూ, ఏడుస్తున్న పిల్లల్నీ, కుయ్యోమొర్రో మంటున్న ఆడవాళ్ళనీ వెంట బెట్టుకుని వానలో తడుస్తూ, తమకంటూ ఒక ఆశ్రయంలేని కటిక ప్రపంచంలోకి వాళ్ళు వెళ్ళిపోతూ వుండడం ఏనాటికి చెరిగిపోని, జీవిత కాలమంతా వెన్నంటి వుండే దృశ్యంగా మనసులో నిలిచి పోయింది.

ఆ క్షణాన నాకు మామయ్య పైన కోపం వచ్చిన మాట నిజం. కాని అప్పటి కది సమయం కాదనుకుని, తెల్లవారాక ఆయన మళ్ళీ తన మామూలు మూటలో వున్నప్పుడు ప్రశ్నించాను-

"ఏం మామయ్యా! ఎవరో ఇల్లూ వాకిలీలేని అనాథలు పాపం! వాన వెలిసే దాకా వాళ్ళని వసారాలో వుండనివ్వరాదా?" అని.

నా అమాయకత్వానికి జాలి పడుతున్నట్టు మామయ్య కొద్ది క్షణాలపాటు అదేపనిగా నా ముఖంలోకి చూచాడు.

"ఒరే అబ్బాయ్! చదువుకున్నంత మాత్రాన చాలదురా! లోకజ్ఞానం గూడా వుండాలి. నాకామాత్రం దయలేకగాదు. వాళ్ళను వెళ్ళిపొమ్మన్నది. ఎందుకో తెలుసా? ఉండమన్నామనుకో, వాళ్ళకి లోకం చాలా మంచిదనిపిస్తుంది. 'ఆలీజ్ వెల్ విద్ది వరల్డ్' అనుకుంటే యింకేముంది? అప్పుడిక మన ప్రయోజనం ఎలా నెరవేరేటట్టు? వాళ్ళకు వుక్రోషం కలగాలి. ఆగ్రహం రగులుకోవాలి. వ్యవస్థపైన తిరుగుబాటుకు పూనుకోవాలి. అదే మన ఆశయం ఏమంటావు?"

నాకప్పుడు తెలిసింది... మామయ్య కత్తికి రెండంచులా పదునని!

"జ్యోతి" మాసపత్రిక, 1984